క్లుప్తంగా

నేడు కొప్పురావు కాలనీలో లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య మంగళవారం కొప్పురావు కాలనీ 19, 20వ వార్డులలో ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రచారంలో లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

8న భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని గరువుకొండ వద్దనున్న భక్తాంజనేయస్వామి 14వ తిరునాళ్ల ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అదేరోజు సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 9వతేదీన ఉగాది పండుగనాడు స్వామివారికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలను అర్చకులు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

ఫోన్లు, డివైజ్‌లు సబ్‌మిట్ చేసిన వలంటీర్లు



తాడేపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు సామాజిక పెన్షన్లు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదంటూ సీఈసీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో, దుగ్గిరాల మండల పరిధిలో 38 సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు వారికి ప్రభుత్వం అందజేసిన సెల్‌ఫోన్లు, డివైజ్‌లను ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు సోమవారం అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తాడేపల్లి పట్టణ, రూరల్‌లోని 20 సచివాలయాల్లో వలంటీర్ల దగ్గర నుంచి సేకరించిన ఫోన్లు, డివైజ్‌లను కార్పొరేషన్ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈనెల అందజేసే సామాజిక పెన్షన్లు సచివాలయాల వారీగా వెల్ఫేర్ అసిస్టెంట్లు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పోలింగ్ స్టేషన్లలో బోర్డులు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికారులు పోలింగ్ బూత్‌లలో అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. సోమవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 51 పోలింగ్ బూత్‌లలో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ నెంబరు 87, పార్లమెంట్ నియోజకవర్గ పరిధి 13తో పాటు పోలింగ్ స్టేషన్‌నెంబరు, చిరునామా, బీఎల్‌ఓ పేరు, ఫోన్ నెంబరు, సూపర్‌వైజర్, పోలీస్‌స్టేషన్, సెక్టార్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, వార్ల పేర్లు, ఫోన్ నెంబర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరికి ఎటువంటి సందేహాలు వచ్చినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు.

మూడు గ్రామాల్లో పోలీసు కవాతు



ఫిరంగిపురం: ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సీఐ వీరేంద్రబాబు అన్నారు. మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, మునగపాడు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పోలీసు బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం సీఏస్‌ఎఫ్, పోలీసు బలగాలతో ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ వీరనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నవులూరులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు మక్కెవారిపేట, గోలివారితోట, బాపనయ్య నగర్, ఈఎస్‌ఆర్ గార్డెన్స్, టిడ్కో ఇళ్ల ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పండుటాకుల వెతలు పట్టవా?!

చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పింఛను లబ్ధిదారులు

మంగళగిరి,తాడేపల్లి రూరల్: ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికే వచ్చి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లను టీడీపీ, చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గం అని వృద్ధులు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో పింఛను తీసుకోవాలంటే ఎండల్లో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి ఇబ్బంది పడేవాళ్లమని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఇంటికే పింఛను పంపిస్తుండడంతో సంతోషంగా జీవిస్తున్నామని, ఇప్పుడు చంద్రబాబు కుట్రలతో అడ్డుకోవడం దారుణమన్నారు.



చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

పింఛన్లు అడ్డుకోవడం దుర్మార్గం



మాలాంటి వృద్ధుల కష్టం చూసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల ద్వారా ఇంటికి పింఛను పంపిస్తుండడంతో ఆనందగా ఉన్నాం. గత టీడీపీ పాలనలో పింఛను తీసుకోవాలంటే రోజుల తరబడి కార్యాలయాల చూట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు వలంటీర్లును ఎన్నికల పేరుతో చంద్రబాబు పింఛన్లు ఇంటికి రాకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ఈ వయస్సులో నడుచుకుంటూ సచివాలయానికి వెళ్లి క్యూలో నిలుచుని పింఛను తీసుకునే ఓపిక లేదు.

– కాటూరి లక్ష్మీదేవమ్మ, ఆత్మకూరు

టీడీపీ నాటకాలను జనం గమనిస్తున్నారు..



వలంటీర్లు పింఛను ఇంటి వద్దనే పంపిణీ చేస్తే తప్పేంటి? టీడీపీ, చంద్రబాబు ఆడుతున్న నాటకాలను పింఛనుదారులు గమనిస్తున్నారు. వలంటీర్లు రాజకీయాలకు అతీతంగా అందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలను అందజేస్తున్నారు. వారిపైన ఫిర్యాదు చేసి పింఛన్లు, సంక్షేమ పథకాలను చంద్రబాబు టీడీపీ అడ్డుకోవడం సరికాదు. ఇప్పటికైనా చంద్రబాబు తన తీరు మార్చుకుని ఎన్నికల కమిషన్‌ను వలంటీర్లే సంక్షేమ పథకాలు అందించాలని కోరాలి. లేదంటే రానున్న ఎన్నికలలో లబ్ధిదారుల చేతిలో ఘోరపరాజయం తప్పదు.

– బూదాటి మల్లేశ్వరరావు, మంగళగిరి

చంద్రబాబు కుట్ర.. వృద్ధులకు ఇబ్బంది



వృద్ధులు, దివ్యాంగులు, వితంతులకు అందే పింఛన్లపైనా టీడీపీ, ఎల్లో మీడియా కుట్రలు చేయడం సిగ్గుచేటు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు అందించే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లేకుంటే పంపిణీ ఏవిధంగా సాధ్యం. లబ్ధిదారులు ఎంత ఇబ్బంది పడతారనే కనీస అవగాహన లేకుండా పంపిణీ నిలిపివేయాలని కుట్ర చేశారు. పింఛన్ల పంపిణీని తన కుట్ర, కుయుక్తులతో అడ్డుకున్న చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే పింఛను పెంచుతానంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరు ఆపలేరు.

– సంకె సునీత, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు

కొండపై నుంచి కిందకి దిగాలంటే ఇద్దరు కావాలి..



నేను కొండ మీద నుంచి కిందకు దిగాలంటే ఇద్దరు మనుషులు కావాలి. పేదవారిమైన మేము కొండపై చిన్న ఇల్లు వేసుకుని నివాసముంటున్నాం. మా పిల్లలు ఇద్దరూ ఉదయాన్నే పనికి వెళతారు. నెలనెలా ఆసుపత్రికి వెళ్లాలంటేనే చాలా ఇబ్బంది పడుతున్నాను. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి పెన్షన్ తీసుకోవాలంటే ఇప్పటి నుంచే భయం వేస్తోంది. కరోనా సమయంలో కూడా వలంటీర్లు భయపడకుండా మా ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చారు. మా ఇంట్లో వారికి కరోనా వచ్చిందనే అనుమానంతో ఇంట్లోనే ఉంటే వంటకి కావలసిన సరుకులతో పాటు మందులను కూడా వారే తీసుకు వచ్చారు.

– వెంకమ్మ, పోలకంపాడు

వాళ్లకు మా కష్టాలు ఏం తెలుసు?



ఎన్నికల కమిషన్‌కు వలంటీర్లపై ఫిర్యాదు చేసిన వారికి మా కష్టాలు ఏం తెలుసు? వాళ్లు ఎంతో డబ్బున్న వారు. సహృదయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటికి పెన్షన్లు అందజేస్తుంటే ఇలాంటి చర్యలు చేపడతారా? ఇప్పుడు మాట్లాడుతున్న వారు కరోనా వచ్చినప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పాలి. వలంటీర్లు ప్రాణాలకు సైతం తెగించి మా అవసరాలను తీర్చారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి మాలాంటి వారికి ఎన్నో సేవలు చేయాలని కోరుకుంటున్నాను.

– ఎస్‌కే నాగులు, నులకపేట

ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదనే..



ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదు అనే లక్ష్యంతోనే టీడీపీ, నిమ్మగడ్డ రమేష్, ఎల్లోమీడియా కుట్ర చేసి పింఛన్లు పంపిణీ అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. అందులో భాగంగానే వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేశారు. పండుటాకుల నోటి దగ్గరి భోజనాన్ని లాక్కునేందుకు టీడీపీ నాయకులు కుట్రలు చేయడం దుర్మార్గం.

– మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు

ఐదేళ్లలో టిడ్కో ఇళ్లు ఎందుకివ్వలేదు?



మెయిన్ బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావులు

- లోకేష్, చంద్రబాబులు మంగళగిరిలో చేసిన ఒక్క అభివృద్ధి పని చూపించి ఓట్లు అడగాలి
- మేము ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలుసు
- లోకేష్‌కు మళ్లీ మంగళగిరిలో ఘోర ఓటమి తప్పదు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- కోలాహలంగా లావణ్య ప్రచారం

మంగళగిరి: రానున్న ఎన్నికలలో గెలిపిస్తే మంగళగిరిని గచ్చిబౌలి చేస్తా.. టిడ్కో ఇళ్లకు వసతులు కల్పిస్తా అంటూ బూటకపు ప్రచారం చేస్తున్న నారా లోకేష్ గత టీడీపీ పాలనలో మూడు శాఖల మంత్రిగా వున్న సమయంలో, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నియోజకవర్గంలోనే నివాసముంటున్న సమయంలో ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రశ్నించారు. పట్టణంలోని 12వ వార్డు మెయిన్ బజార్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవితి భగవన్నారాయణ, నేరెళ్ల మురళి, సీనియర్ మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్ అహ్మద్‌లతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ చిత్తశుద్ధి వుంటే టీడీపీ అధికారంలో వున్న ఐదేళ్లలో టిడ్కో ఇళ్లు ఎందుకు లబ్ధిదారులకు కేటాయించలేకపోయారని నిలదీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం టిడ్కో నివాసాలకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. టీడీపీ పాలన ఐదేళ్లలో మంగళగిరి నియోజకవర్గంలో చేసిన ఒక్క అభివృద్ధి కార్యక్రమం చెప్పగలరా.. నిర్మించిన ఒక్క భవనం చూపించగలరా అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం నియోజకవర్గంలో వేసిన రోడ్లు, కట్టిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు, చేనేత భవనం, మగ్గాల షెడ్లు, సీసీ, గ్రావెల్ రోడ్లు, సామాజిక భవనాలతో అనేక అభివృద్ధి పనులు నియోజకవర్గ ప్రజలకు తెలుసుకాబట్టే రానున్న ఎన్నికలలో లావణ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. లోకేష్‌కు మళ్లీ ఘోర పరాభవం తప్పదని స్పష్టం చేశారు. లావణ్య మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. ఇక్కడే పుట్టి పెరిగినందున తనకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని, హైదరాబాద్‌లో నివాసముంటూ విజిటింగ్ ప్రొఫెసర్‌లా మంగళగిరికి వచ్చే వారిని ప్రజలు ఆదరించరన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవతి భగవన్నారాయణ, నేరెళ్ల మురళి, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, రాచకొండ వెంకటేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, రేఖా వకులాదేవి, రాజ్యలక్ష్మి, థామస్, కొల్లి వాసు, గూండా మధు, వల్లంశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ మహేంద్ర సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి ఎముకలు బయటపడిన మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహేంద్ర మాట్లాడుతూ మృతిచెందిన వ్యక్తి వయస్సు 50–60 సంవత్సరాలు ఉండవచ్చని, ఎప్పుడు బకింగ్ హామ్ కెనాల్‌లో కొట్టుకు వచ్చి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి మృతదేహం కుళ్లిపోయి ఎముకలు బయటపడ్డాయని, మృతుని వంటిపై బ్లూ, ఎరుపు రంగు కలిగిన షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ఉన్నాయని, మోరంపూడి వీఆర్‌ఓ దేవరపల్లి రత్నకుమారి సమక్షంలో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు.

ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: జాతీయ స్థాయిలో జరిగిన రెండు ఒలింపియాడ్ పోటీల్లో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన ఆరుగురికి బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం లభించిందని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు జనవరి నెలలో పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు, పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

మేడికొండూరు: మండలపరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు శౌరిరెడ్డి, బాసాని జైపాల్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, జి.రవి, గ్రామ సర్పంచ్ కుంభా శివయ్య త్రివేణిల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల 40 కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరారు. తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా సుచరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కుల,మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడం చూసి గ్రామంలో 40 కుటుంబాల వారు పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకయ్య, షేక్ షంషీర్, ఆబిద్, సల్మా, కరీముల్లా, జానీ బాషా, నూర్‌బాషా, గౌస్, షేక్‌సుభాని, దొప్పలపూడి కిరణ్, ఏసోబు, నేలపాటి సురేష్, నరేంద్ర, ప్రేమ్‌కుమార్, జాన్, కొమ్మాలపాటి ప్రేమ్‌కుమార్, టి.సన్ని, ఆకాష్, సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

తాడికొండ చెక్‌పోస్టులో రూ.1.24లక్షలు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1,24,320 నగదును పట్టుకున్నారు. అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ అనే వ్యక్తి బైక్‌లో నగదు పెట్టుకొని వెళుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా ఎలాంటి రశీదులు చూపించలేదు. దీంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ సహాయంతో ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.



విచారిస్తున్న అధికారులు

అన్నివర్గాలకు మేలు చేసిన జగనన్న

- ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత
- బేజాత్పురంలో ఎన్నికల ప్రచారం

బేజాత్పురం(తాడికొండ): రాష్ట్రంలో అన్ని వర్గాలకు కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా మేలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. సోమవారం తాడికొండ మండలం బేజాత్పురం గ్రామంలో పర్యటించిన ఆమెకు గ్రామస్తుల నుంచి విశేష ఆదరణ లభించింది. తొలుత ముస్లిం కాలనీ, ఎస్సీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించిన ఆమె ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరి సమస్యలు సానుకూలంగా వింటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ ముందుకు కదిలారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయనంత అభివృద్ధి, సంక్షేమం అర్హులందరికీ ఇంటికే అందించిన ఘనత జగనన్నదే అన్నారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులకు జగనన్న ఇళ్లవద్దకే ప్రతి నెలా ఒకటో తేదీనే అందిస్తుంటే ఎక్కడ ప్రజలు సానుకూలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మొగ్గు చూపుతారో అనే భయంతో చంద్రబాబు కుట్రపూరితంగా వ్యవహరించి ఈసీకి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. దీని కారణంగా 1వ తేదీన రాష్ట్రంలో పింఛన్ వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మీకు మంచి జరిగితేనే ఓట్లు వేయండి లేకుంటే వద్దు అని చెప్పిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పేదలకు సంక్షేమం అందకుండా నోటికందే సొమ్మును వెనక్కి నెట్టిన బాబుకు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా ఉందని, బాబు ఇకనైనా కుటిలమైన పనులు మానుకుంటే మేలన్నారు.



బేజాత్పురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఈ కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ల శివ నాగరాజు, జిల్లా మైనార్టీ విభాగం నాయకులు షేక్ జానీ, సీనియర్ నాయకులు వడ్లమూడి రాజేంద్ర, పరుచూరి నారాయణ, నిడుముక్కల, పాములపాడు సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బిక్కి శివరామకృష్ణ, ఎంపీటీసీలు బోడపాటి సుశీల, వలపర్ల కల్పన, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండలో మేకతోటి హర్షిత్ ప్రచారం..

మండల కేంద్రమైన తాడికొండలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ 14వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు అన్ని వర్గాలకు మేలు జరగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రభంజన విజయంతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీ ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు తోకల నరసింహారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ జుబేర్, మండల సేవాదళ్ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్, తుమ్మల తిరుపతిరెడ్డి, ఉండవల్లి నరసింహారావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుది కుల దురహంకార మనస్తత్వం

ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుల దురహంకార, భూస్వామ్య, నీచ మనస్తత్వం కలిగిన వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదల పట్ల, వివిధ వృత్తులు చేసుకుని గౌరవంగా బ్రతికే శ్రామికుల పట్ల అత్యంత చులకన భావం ఉందని విమర్శించారు. ఉన్నత విద్యాధికుడైన సింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులను ఉద్దేశించి టిప్పర్ (లారీ) డ్రైవర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సీటు ఇచ్చారని అత్యంత వ్యంగంగా, హేళనగా మాట్లాడారని తప్పుపట్టారు. వీరాంజనేయులు ఉన్నత విద్యాధికుడని, ఉద్యోగం దొరకకపోవడంతో టిప్పర్ డ్రైవర్‌గా నిజాయితీగా తన కుటుంబాన్ని పోషిస్తూ గౌరవంగా జీవిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు నాయుడు దృష్టికలో టిప్పర్ డ్రైవర్లు, కారు డ్రైవర్లు, వివిధ వాహనాల డ్రైవర్లు మనుషులు కారా అని ప్రశ్నిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పాలిట ఆత్మబంధువు అని, సామాన్యులను సైతం గెలిపించి పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపగలరని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎస్సీలలో పుట్టాలని ఎవరు కోరుకుంటారని సభ్య సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరం ప్రారంభం

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూ టర్ సైన్స్ టెక్నో క్రాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ప్రారంభించారు. అమరావతి – గుంటూరు ప్రధాన రహదారిపై కళాశాల ఎదుట ఉన్న బస్‌స్టాప్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ కుమార్ మాట్లాడుతూ వేసవి ఎండల తాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే సేవాభావంతో విద్యార్థులు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా చేయడం వాలన వారిలో సామాజిక స్పృహను పెంపొందించవచ్చన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ టెక్నోక్రాట్స్ విభాగం విద్యార్థులను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి జి.రామచంద్రరావు, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ప్రారంభించి పంపిణీ చేస్తున్న విద్యాసంస్థల సెక్రటరీ వై.సుజిత్ కుమార్

30 మద్యం బాటిళ్లు పట్టివేత

మంగళగిరి: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద 30 మద్యం బాటిళ్లను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన కె.రవీంద్ర, బీట సాయి, దూది వరుణ్‌కుమార్‌లు కారులో విజయవాడ నుంచి తెనాలి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్శిల్ కార్యాలయాలలో తనిఖీలు..

పట్టణంలో ఆటోనగర్‌లోని పలు పార్శిల్ కార్యాలయాలలో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ పార్శిల్ కార్యాలయాలలో ఏవైనా అనుమానస్పదంగా పార్శిల్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా పెద్ద సంఖ్యలో ఇంటి సామాగ్రి, చీరలు, మిక్సీలు లాంటి పార్శిల్‌లో వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పార్శిల్ కార్యాలయాల నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు